సాక్షి
వనపర్తి
గురువారం । 29 । జూన్ । 2023



'ఇండోర్' పనులు ముమ్మరం
పాలమూరులో ఇండోర్ స్టేడియం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.
వివరాలు 8లో ▸



చెంచుల జీవనంపై అధ్యయనం
ఎన్ఐఆర్డీ శిక్షకుల బృందం చెంచుల జీవన స్థితిగతుల గురించి తెలుసున్నారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.9 /24.5

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాఠశాల తనిఖీ



వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని కేడీఆర్‌నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలను బుధవారం ఇన్‌చార్జ్ డీఈఓ గోవిందరాజులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం మెనూ విధిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు.

క్విజ్ పోటీలను విజయవంతం చేయండి



కొత్తకోట: రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు జూలై 2న నిర్వహించనున్నామని.. యువత, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని నివేదిత కళాశాలలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు ముందుగా సెల్‌ఫోన్ నంబర్ 76618 99899కు మిస్డ్‌కాల్ ఇచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ వెబ్‌లింక్‌తో కూడిన ఎస్ఎంఎస్‌ను పొందుతారని.. అందులో పూర్తి వివరాలను జూలై 1లోగా నమోదు చేయాలని సూచించారు. 60 నిమిషాల్లో 60 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని, భారతదేశ భౌగోళిక చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ సంస్కృతి, చరిత్ర, సామాజిక ఉద్యమాలతో పాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాలపై ప్రశ్నలు ఉంటాయని వివరించారు. ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, నాగన్నసాగర్, బోయేజ్, రమణ, బీచుపల్లి నాయుడు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్



వనపర్తి: శాంతిభద్రతలను పెంపొందిస్తూ నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని డీఎస్పీ ఆనంద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం జిల్లాకేంద్రంలోని ఇందిరాకాలనీకి చేరుకున్న పోలీసులు రోడ్డు ప్రమాదాలను నివారించే పద్ధతులు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నంబర్ ప్లేట్ సక్రమంగా లేని వాహనాలు, చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీ తదితర అంశాల గురించి ప్రజలకు వివరించారు. సరైన పత్రాలు లేని 39 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను స్వాధీనం చేసుకొని పత్రాలు తీసుకొచ్చి చూపించి తీసుకెళ్లాలని కోరారు. కాలనీల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసుశాఖ సహకారం అందిస్తుందన్నారు. భద్రతలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని.. తనిఖీలు నిర్వహించడంతో నేరాల రేటు తగ్గుతుందని వివరించారు. సీఐ డీకే మహేశ్వర్‌రావు, ఎనిమిది మంది ఎస్ఐలు, 11 మంది ఏఎస్ఐలు, 39 మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వనపర్తి టౌన్: ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఇన్‌చార్జ్ బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో వసతిగృహ సంక్షేమ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమైందని, ప్రతి వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలన్నారు. వంట గదిని స్వచ్ఛంగా ఉంచుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి అనిల్‌కుమార్ సెలవుపై వెళ్లడంతో సుబ్బారెడ్డి ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టారు.

కారు, బస్సు ఢీ

పెబ్బేరు: పట్టణంలోని కర్నూలు బైపాస్ రహదారిపై ఆర్టీసీ బస్సు, కారు ఢీకొని ఒకరికి స్వల్ప గాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కర్నూలు జిల్లా బనగానపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్‌కు వెళ్తూ పట్టణంలోకి వెళ్లే మలుపు వద్ద శంషాబాద్ నుంచి కర్నూలుకు వెళ్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు బస్‌డ్రైవర్ మనోహర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

పెట్టుబడి సాయం

జిల్లాలో 1,69,192 మంది రైతులకు ప్రయోజనం

- రూ.179,92,32,711 విడుదల
- మొత్తం రైతులు 1,80,240 మంది
- వివరాలు నమోదు చేసుకోని రైతులు 11 వేల మంది పైచిలుకు..



అమరచింత మండలం ధర్మాపురం శివారులో వ్యవసాయ పనుల్లో రైతులు (ఫైల్)

అమరచింత: ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రైతుబంధు నిధులను సకాలంలో విడుదల చేయడంతో రైతులు తమ ఖాతాల్లో జమ అవుతున్న డబ్బులు తీసుకునేందుకు బ్యాంకుల వద్ద పడిగాపులు పడుతున్నారు. రైతుబంధు నిధులు ఈ నెల 26న మంజూరు చేయడంతో జిల్లాలోని 14 మండలాలు.. 224 గ్రామాల్లోని 1,69,192 మంది రైతులు లబ్ధి చేకూరనుంది. కాగా జిల్లావ్యాప్తంగా 1,80,240 మంది రైతులు ఉండగా.. ఇప్పటి వరకు 11 వేల మంది పైచిలుకు అన్నదాతలు తమ వివరాలను సకాలంలో అందజేయకపోవడంతో ఈసారి రైతుబంధు సాయం పొందలేకపోతున్నారని సంబంధిత వ్యవసాయ అధికారులే చెబుతున్నారు.

మండలాల వారీగా ఇలా..

మండలం	రైతులు	మొత్తం నిధులు	బ్యాంకు లింకేజీ ఉన్న రైతుల	మంజూరైన నిధులు
పాన్‌గల్	18,740	19,17,33,123	17,422	18,66,24,686
వనపర్తి	18,459	14,69,06,702	16,416	14,13,19,184
కొత్తకోట	17,343	14,82,63,556	16,202	14,35,86,214
ఖిల్లాఘనపురం	15,144	13,82,16,017	14,169	13,45,19,007
పెద్దమందడి	14,923	15,08,28,555	13,908	14,57,80,232
పెబ్బేరు	14,585	15,68,80,513	13,724	15,21,94,571
గోపాల్‌పేట	14,194	13,75,89,124	13,275	13,37,25,015
వీపనగండ్ల	11,704	15,45,91,443	11,324	15,20,25,661
చిన్నంబావి	11,270	14,58,62,188	10,940	14,41,30,964
ఆత్మకూర్	10,922	12,70,37,229	10,388	12,41,34,529
మదనాపురం	9,572	9,47,66,813	9,149	9,23,60,095
రేవల్లి	8,173	8,73,77,774	7,363	8,53,22,465
శ్రీరంగాపురం	7,639	7,08,36,034	16,416	6,94,49,226
అమరచింత	7,572	9,63,95,376	7,150	940,60,862

11వ విడత మంజూరు..

విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోకుండా ఉండేందుకు పెట్టుబడికి సాయం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 2018 వానాకాలం నుంచి రైతుబంధు పథకాన్ని అమలు చేస్తోంది. ఏడాదికి రెండుసార్లు వానాకాలం, యాసంగి సీజన్‌లో ఎకరాకు రూ.5 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తుంది. ఇప్పటి వరకు పది విడతలు పూర్తికాగా.. 11వ విడత నిధులను రైతుల ఖాతాల్లో ఈ నెల 26 నుంచి జమచేస్తోంది. బుధవారం వరకు జిల్లా వ్యాప్తంగా 1,02,059 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.47 కోట్ల 37 లక్షల 48 వేల 909 జమయ్యాయి.

సకాలంలో అందించాలి..



పెట్టుబడి సాయం సకాలంలో అందితే విత్తనాలతో పాటు సాగు పనులు చేసుకొనే అవకాశం ఉంటుంది. ఐదు ఎకరాల పొలంలో ఈసారి పత్తి సాగు చేయాలని నిర్ణయించాను. వచ్చిన డబ్బులను పెట్టుబడికి వినియోగిస్తా.

– కడియాల నర్సింహులు, రైతు, అమరచింత

రైతులకు ప్రయోజనం..



ప్రభుత్వం అందించే రైతుబంధు సాయం రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. కొత్తగా భూమి కొనుగోలు చేసిన రైతులు దరఖాస్తు రైతుబంధు సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించాం. సమాచారాన్ని రైతులకు చేరవేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– సుధాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

పుర ప్రజలకు మెరుగైన సేవలు



చైర్మన్‌ను తన ఛాంబర్‌లో కూర్చోబెట్టిన మంత్రి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తదితరులు

- మున్సిపల్ కార్యాలయం ప్రారంభోత్సవంలో మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తిటౌన్: పుర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, పాలకులు చొరవ చూపాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం సంతబజార్‌లోని మున్సిపల్ కార్యాలయాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ప్రారంభించి కార్యాలయంలోని ఆయా విభాగాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టామని వివరించారు. రహదారి విస్తరణ చేపట్టి చిరకాల కోరిక నెరవేర్చామని.. ఇందుకు ప్రజల సహకారం మరువలేనిదని కొనియాడారు. పుర కార్యాలయానికి ఆధునిక, సాంకేతిక వసతులు సమకూర్చామన్నారు. అనంతరం చైర్మన్ ఛాంబర్‌లో చైర్మన్ గట్టుయాదవ్‌ను కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, భువనేశ్వరి, నాగన్నయాదవ్, కంచె రవి, చీర్ల సత్యం, మహేష్, నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, స్టార్ రహీం, గులాం ఖాదర్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం మొదట వాస్తు పూజ, రుద్ర హోమం నిర్వహించగా చైర్మన్, స్థానిక కౌన్సిలర్ భువనేశ్వరి దంపతులు పాల్గొన్నారు. చైర్మన్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కమిషనర్ విక్రమసింహారెడ్డి, డీఈ సూర్యనారాయణ, ఏఈలు భాస్కర్, హేమలత వారివారి ఛాంబర్‌లోని కుర్చీలో కూర్చొని పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, చీర్ల సత్యం, మహేష్, రమాదేవి, భువనేశ్వరి, నాగన్న యాదవ్, గులాం ఖాదర్‌ఖాన్, నాయకులు స్టార్ రహీం, రామకృష్ణ, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, శ్యామ్‌కుమార్, నందిమళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు..

వనపర్తి: నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకుగాను నిధులు మంజూరైనట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖిల్లా ఘనపురం మండలం గట్టుకాడిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.2.50 కోట్లు, పెబ్బేరు మండలం బునాదిపురం గ్రామంలో రహదారుల నిర్మాణానికి రూ.83.90 లక్షలు, జిల్లాకేంద్రంలో రూ.5 కోట్లతో నిర్మిస్తున్న టౌన్‌హాల్‌కు అదనంగా రూ.75 లక్షలు, జిల్లాకేంద్రంలో డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.90 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. సీఎం రోడ్డు మార్గాన గద్వాల వెళ్లినప్పుడు బునాదిపురం శివారులో వేరుశనగ పంటను పరిశీలించేందుకు దిగిన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రహదారి నిర్మాణానికి నిధులు విడుదల చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

అధికారమే లక్ష్యంగా ముందుకు..

- నేటి బహిరంగసభకు భారీగా ఏర్పాట్లు
- బీజేపీ రాష్ట్ర నాయకుడు సుభాష్‌చందర్‌జీ



సభా ప్రాంగణం వద్ద బీజేపీ నాయకులు

ఆత్మకూర్: మండల కేంద్రంలోని బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు జరిగే బహిరంగసభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరుకానున్నారని.. ఇందుకోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నామని పార్టీ రాష్ట్ర నాయకుడు, హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం సభా ప్రాంగణాన్ని పరిశీలించి నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నాయకులు, కార్యకర్తలు అధికారమే లక్ష్యంగా ముందుకెళ్లాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి వివరించాలని సూచించారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని.. బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టాలని కోరారు. సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మోదీ అభిమానులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు మాధవరెడ్డి, ప్రతాప్, రేచింతల శ్రీను, అశోక్‌కుమార్, అశ్విన్‌కుమార్, నరాల నారాయణ, మేర్వరాజు, తమ్మలి విజయ్, క్యామ భాస్కర్, గంగాధర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, ఆనంద్, నాగేందర్‌రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్.. పాల్గొన్న అధికారులు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: వ్యక్తిగత, వ్యాపార లావాదేవీలు బ్యాంకుతో అనుసంధానమై డిజిటల్ లావాదేవీలు చేసేలా చూడాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నాలుగో త్రైమాసికంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు, సాధించిన ఫలితాలపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. యువత, మహిళలు ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి రుణాలను సద్వినియోగం చేసుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో సారవంతమైన భూములు, సాగునీరు పుష్కలంగా ఉందని, కొన్నేళ్లుగా పంట దిగుబడులు సైతం బాగున్నందున రైతులకు ఉదారంగా రుణాలిచ్చి మరింత ప్రోత్సహించాలని సూచించారు. ఇప్పటి వరకు రుణాలు తీసుకోని నిరక్షరాస్యులైన రైతులను గుర్తించి వారికి రుణ అవకాశాలపై అవగాహన కల్పించాలన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించని పక్షంలో సిబిల్ స్కోర్ పడిపోయి పెద్ద రుణాలు కోల్పోయే ప్రమాదం ఉదని.. ఈ విషయాన్ని రైతులు, మహిళలకు వివరించాలని కోరారు. ఇందుకు రైతువేదికలను వినియోగించుకోవాలని, ప్రతి మంగళ బుధవారం రైతువేదికల్లో జరిగే సమావేశాల్లో బ్యాంకర్లు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొని అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యాపారరంగంలోకి వచ్చే యువతను ప్రోత్సహించి అవసరమైన డీపీఆర్ ఏ విధంగా రూపొందించాలి, డాక్యుమెంట్లు తదితర అంశాలపై బ్యాంకర్లు సిబ్బందిని కేటాయించి తెలియజేయాలని కోరారు. జిల్లాలోని మహిళా సంఘాలు ఏటా సుమారు రూ.250 కోట్ల పైచిలుకు రుణాలు పొంది తిరిగి చెల్లిస్తున్నారని గుర్తుచేశారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులకు ఇచ్చే రాయితీ రుణాలు పెండింగ్ లేకుండా సత్వరమే మంజూరు చేయాలని, ఏమైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. జిల్లాలో మొండి బకాయిలు 4.63 శాతం ఉన్నాయని.. తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జెడీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్యాంకులు తమ లక్ష్యాలను బాగానే సాధిస్తున్నాయి కానీ, ప్రజలు ఇంకా ఆశించినస్థాయిలో లబ్ధి పొందలేకపోతున్నారని చెప్పారు. జిల్లాలోని విద్యావంతులు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్‌బీఐఎల్‌డీఓ వైభవ్ వ్యాస్, నాబార్డ్ డీడీఎం షణ్ముఖాచారి, లీడ్ బ్యాంక్ మేనేజర్ అమూల్ పవార్, డిక్కీ కో–ఆర్డినేటర్ సోమశేఖర్, ఎస్‌బీఐ కంట్రోలర్ వెంకటేశ్వర్లు, యూనియన్ బ్యాంక్ నుంచి శ్రీనివాస్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ..

ఆస్పత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యంతో పాటు నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం స్థానిక జిల్లా జనరల్ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఆయా వార్డుల్లో చికిత్స పొందుతున్న వారిని పలుకరించారు. వైద్యసేవలు, ప్రభుత్వం తరుపున అందిస్తున్న ఆహారం తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణ ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

అమరచింత: విద్యుత్ అక్రమంగా వినియోగిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏడీ శివశంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో మూడేళ్లలో ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు జరిపిన దాడుల్లో 1,200 మందిపై కేసులు నమోదయ్యాయన్నారు. వీరి నుంచి సుమారు రూ.40 లక్షలు వసూలు చేయాల్సి ఉందని తెలిపారు. మొండి బకాయిల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా రూ.కోటి బకాయిలు ఉన్నాయని.. వినియోగదారులు ప్రతి నెల క్రమం తప్పకుండా విద్యుత్ బిల్లులు చెల్లించాలని కోరారు. ఆయనవెంట ఏఈఈ షన బేగం, లైన్‌మెన్ రాజు ఉన్నారు.



సంస్కరణవాది పీవీ నరసింహారావు



పీవీ నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్: ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన దార్శనికుడు దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్ పేర్కొన్నారు. బుధవారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చీర్ల విజయ్‌చందర్ మాట్లాడుతూ.. తెలుగు తేజమైన పీవీ దేశానికి విశేషమైన సేవలు అందించారని, నేటికీ ఎక్కడ సంస్కరణల గురించి చర్చ జరిగినా గుర్తుకొస్తారని వివరించారు. అలాంటి నాయకుడు నేటితరం రాజకీయ నాయకులకు స్ఫూర్తి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సమద్ మియా, వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, కౌన్సిలర్ సుమిత్ర, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కృష్ణ బాబు, నాయకులు చీర్ల జనార్దన్, సురేష్, బాబా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జూలై 13న క్రీడా పాఠశాలలకు ఎంపికలు

వనపర్తి టౌన్: హకీంపేటలోని క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం జూలై 13న స్థానిక బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు డీవైఎస్ఓ సుధీర్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతిలో ప్రవేశానికి 8 నుంచి తొమ్మిదేళ్లు, 5వ తరగతిలో ప్రవేశానికి 9 నుంచి పదేళ్ల వయసున్న విద్యార్థులు అర్హులని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, కుల, జనన ధ్రువీకరణ పత్రాలు, 3, 4వ తరగతి ప్రోగ్రెస్ కార్డులు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

రిజర్వాయర్ల నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



రోడ్డుమీదితండాలో గిరిజనులతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఖిల్లాఘనపురం: జిల్లాను సస్యశ్యామలం చేసే గణపసముద్రం, బుద్దారం రిజర్వాయర్లను ఎప్పుడు పూర్తి చేస్తారో ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కోరారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా బుధవారం మండల కేంద్రంతో పాటు రోడ్డుమీద తండా, అప్పారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం వేసిన శిలాఫలకాన్ని ,1997లో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను పరిశీలించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు నీళ్లందించే కొండ పోచమ్మ ప్రాజెక్టుకు రూ.1,891 కోట్లు వెచ్చించి పనులు పూర్తి చేశారని.. గణప సముద్రం ప్రాజెక్టుకు రూ.55 కోట్లు, బుద్దారం రిజర్వాయర్‌కు రూ.42.2 కోట్లు కేటాయించారే తప్పా ఇప్పటి వరకు పనులు ఎందుకు పూర్తి చేయలేదో ప్రజలకు చెప్పాలన్నారు. హైదరాబాద్‌లో వెలమ, కమ్మ కుల సంఘాలకు 5 ఎకరాల భూమి కేటాయించి.. ఇళ్లులేని పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణానికి శిలాఫలకం వేసి నాలుగేళ్లయినా నిర్మాణానికి నోచుకోకపోవడం వింతగా ఉందన్నారు. సీఎం సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో రూ.656 కోట్లు, సిద్దిపేటలో రూ.714 కోట్లు ఖర్చు చేసిన ముఖ్యమంత్రి వనపర్తి జిల్లా అభివృద్ధికి తొమ్మిదేళ్లుగా ఎన్ని నిధులు ఖర్చు చేశారో చర్చకు రావాలని సవాల్ విసిరారు. మంత్రి నిరంజన్‌రెడ్డికి జిల్లా అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదన్నారు. ఘనపురంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను హత్య చేసేందుకు ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి సుపారీ ఇచ్చినట్లు పత్రికల్లో వచ్చిన వార్తలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న అధికార పార్టీని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల అభ్యున్నతికి రాజ్యాధికారమే ధ్యేయంగా సంఘటితంగా కదలాల్సిన సమయం ఆసన్నమైందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, ఇన్‌చార్జ్ నాగనమోని చెన్నరాములు, నాయకులు మిద్దె మహేష్, గద్దం మహేష్, రంజిత్, రాములు, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


వెంకటేష్ (ఫైల్)

మన్ననూర్: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మంగళవారం రాత్రి సుమారు 12గంటల సమయంలో చోటు చేసుకుంది. అమ్రాబాద్ మండలం ప్రశాంతినగర్ (మన్ననూర్) గ్రామానికి చెందిన చిటుగోరి బాలయ్య కుమారుడు చిటుగోరి వెంకటేష్(24) కొంత కాలంగా హైదరా బాద్‌లో ఓ ప్రైవేటు వాహనం (కారు) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం స్వగ్రామం మన్ననూర్ వచ్చాడు. రాత్రి 9 గంటలకు తిరిగి హైదరాబాద్ వెళ్తుండగా కడ్తాల గ్రామం సమీపంలో టిప్పర్ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో 108 అంబులెన్స్ సహాయంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగానే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని కడ్తాల పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

వెల్దండ: మండల పరిధిలోని తిమ్మినోనిపల్లికి చెందిన అమరిశెట్టి రమాదేవి మెడలో ఉన్న దాదాపు నాలుగు తులాల బంగారు పుస్తెలు, గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లిన ఘటన బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలు ఇలాఉన్నాయి. రమాదేవి, వరుసకు వదిన అయిన పద్మతో కలసి కల్వకుర్తి వెళ్లడానికి కొట్రగేట్ వద్దకు నడుచుకుంటూ వస్తున్నారు. అక్కడ ఉన్న ఓ వద్ద దొంగరోడ్డులో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి రమాదేవి మెడలో ఉన్న బంగారు పుస్తెల గొలుసును లాక్కొన్ని పారిపోయారు. దీంతో చోరీ జరిగిందని ఆమె బిగ్గరగా కేకలు వేసింది. కానీ వారు అప్పటికే పరారు కావడంతో ఫలితం లేకపోయింది. ఘటనలో ఆమె కింద పడడంతో స్వల్పగాయాలయ్యాయి. ఈ విషయంపై వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో బాధిత మహిళ ఫిర్యాదు చేశారు.

మిడ్జిల్ పరిధిలో...

మిడ్జిల్: వేముల గ్రామానికి చెందిన చెందిన బండారి లింగమ్మ గ్రామ శివారులోని వెల్జాల్ రోడ్డు పైన నిత్యం కల్లు విక్రయాలు చేపడుతుంది. అందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం సైతం విక్రయాల కోసం కూర్చుని ఉండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెల తాడును చోరీ చేశారు. ఆమె కేకలు వేసే లోపు పరారయ్యారు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా.. గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఆచూకీ లభ్యం కాలేదని ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్ తెలిపారు. కాగా పుస్తెల తాడు విలువ సుమారు రూ. 1.20 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపారు..

నాగర్‌దొడ్డిలో 40 ట్రాక్టర్ల ఇసుక సీజ్


మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డిలో బుధవారం 40 ట్రిప్పుల ఇసుకను ఎస్‌ఐ శేఖర్ సీజ్ చేశారు. గ్రామ సమీపంలోని రిజర్వాయర్ నుంచి అక్రమంగా తరలించి కేశవులు అనే వ్యక్తి ఇంటి సమీపంలో నిల్వ ఉంచారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని అక్రమంగా నిల్వ ఉంచిన 40 ట్రాక్టర్ల ఇసుకను రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేశారు.

పాలెంలో కంది విత్తనాలు

బిజినేపల్లి: పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పీఆర్‌జీ–176 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏడీఆర్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్‌జీ– 176 (ఉజ్వల)రకం విత్తనాలు కావాల్సిన రైతులు పాలెం ఆర్‌ఎఆర్‌ఎస్‌ను సందర్శించి కొనుగోలు చేయవచ్చని, విత్తనాలు కావాల్సిన రైతులు 88088 82766, 62811 21529 నంబర్లను సంప్రదిస్తే.. విత్తన నిల్వలపై మరింత సమాచారం అందుతుందని పేర్కొన్నారు.

‘ఇండోర్’ పనులు ముమ్మరం

- పాలమూర్‌లో రూ.7.79 కోట్ల వ్యయంతో అధునాతన మల్టీపర్పస్ స్టేడియం
- మెయిన్ స్టేడియంలో కొనసాగుతున్న పనులు
- సిద్ధమవుతున్న ప్రేక్షకుల గ్యాలరీ
- భవిష్యత్‌లో జాతీయ స్థాయి ఇండోర్ పోటీలకు అవకాశం


మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నమూనా

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి కృషితో ఉమ్మడి జిల్లాకే తలమానికంగా జిల్లా కేంద్రంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం జరుగుతోంది. ఇన్నాళ్లు ఈ స్టేడియం లేకపోవడంతో ఇండోర్ ఆటల్లో క్రీడాకారులు అంతగా రాణించలేకపోతున్నారు. అలాగే ఇతర టోర్నీలు నిర్వహిస్తున్నప్పటికీ, షటిల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాటోర్నీలకు అవకాశం లేకుండాపోయింది.

రూ.7.79 కోట్లతో సౌకర్యాలు..

మెయిన్ స్టేడియంలో రూ.7కోట్ల 79లక్షల వ్యయంతో అధునాతనమైన క్రీడా సౌకర్యాలతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులపై మంత్రి ఎప్పటికప్పుడు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. పనులు వేగంగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే గ్రౌండ్, రెండో ఫ్లోర్‌లో పెవిలియన్, ఇతర గదుల పనులు పూర్తి చేశారు. ఇండోర్ స్టేడియం పైకప్పు ఫిట్టింగ్ (ట్రస్సెస్) చేశారు. ఇండోర్ స్టేడియంలో లోపల క్రీడాపోటీలను తిలకించడానికి రెండు వైపులా గ్యాలరీలో సీట్లను అమర్చుతున్నారు. బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ క్రీడలకు హాళ్లను ఏర్పాటు చేశారు. స్టేడియంలో కలర్ పనులతోపాటు ఎలక్ట్రికల్ పనులు జరుగుతున్నాయి. త్వరలో సెంట్రలైజ్డ్ ఏసీ కండీషన్, ఆడియో సిస్టం, ఇతర పనులు చేపట్టనున్నారు. వీటికి సంబంధించి జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారులు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ప్రతిపాదనలు పంపారు.

క్రీడాకారులకు మెరుగైన వసతులు..

మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో అన్ని విధాలా క్రీడావసతులు ఏర్పాటు చేస్తున్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఇండోర్ స్టేడియం పూర్తయితే వెయిట్ లిఫ్టింగ్, జూడో, కబడ్డీ, ఇతర ఇండోర్ క్రీడలు ఆడే అవకాశం ఏర్పడుతుంది. అదే విధంగా షటిల్ బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టెన్నికాయిట్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడల్లో ఆడే క్రీడాకారులకు మంచి అవకాశాలు ఏర్పడనున్నాయి. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయస్థాయి ఇండోర్ క్రీడాపోటీలకు వేదికగా మారే అవకాశం ఉంది.


ప్రధాన స్టేడియంలో నిర్మాణమవుతున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం


ఇండోర్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన సీట్లు

ముమ్మరంగా పనులు..



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషి వల్ల జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటవుతోంది. పనులు ముమ్మ రంగా సాగుతున్నాయి. క్రీడాకారులకు అన్ని రకాల వసతులు అందుబాటులోకి వస్తాయి. నిష్ణాతులైన కోచ్‌లు వస్తారు. ఇది అందుబాటులోకి వస్తే జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు తయారయ్యే అవకాశం ఉంది.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

చాలా సంతోషంగా ఉంది...



పాలమూరులో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటువుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. దీంతోపాటు పలు స్టేడియంల నిర్మాణమవుతున్నాయి. జిల్లాలో క్రీడాభివృద్ధి కోసం పాటుపడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వ్యాయామ ఉపాధ్యాయుల తరఫున ధన్యవాదాలు. ఈ స్టేడియం ఔత్సాహిక క్రీడాకారులకు ఒక వేదికలా మారనుంది. – వేణుగోపాల్, పెటా టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మహబూబ్‌నగర్

నేడు తొలి ఏకాదశి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు


జిల్లా కేంద్రంలోని కాటన్‌మిల్ ఆవరణలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి హైందవులకు ఇది మహాపర్వదినం. దీన్ని ‘శయనైకాదశి, ప్రథమ ఏకాదశి’ అని పిలుస్తారు. క్షీరాబ్దిలో శేషపాన్పుపైన శ్రీమహావిష్ణువు శయనించడం వల్ల దీన్ని శయనైకాదశి అంటారు. ఏకాదశి రోజు శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైనది. మోక్షాన్ని ఇచ్చే మాసం ఆషాఢం. ఈరోజు నుంచి ఉత్తరం ఉన్న సూర్యుడు దక్షిణ దిశకు వాలుతున్నట్లుగా కనిపిస్తాడు. నేటి (గురువారం) నుంచి ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీకశుద్ధ ఏకాదశి వరకు ‘చాతుర్మాస్య వ్రతాలు’ పాటిస్తారు. ఏకాదశి 11 సంఖ్యకు సంకేతం. ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, మనస్సు వెరసి పదకొండింటిపైన నియంత్రణ కలిగి వ్రతం ఆచరించాలన్నది ఈ పండుగ సందేశం. ఈరోజు నుంచే పండుగలు ప్రారంభమవుతాయి. రాబోయే శ్రావణ మాసంలో మహిళలు ఆచరించే వ్రతాలు, నోములు బాద్రపద మాసంలో వినాయక నవరాత్రులు, దాని తర్వాత దేవీనవరాత్రులు, దసరా, దీపావళి ఇలా ఎన్నో పండుగలుకు ఈ చాతుర్మస్యం విశేషమైనది.

అభిషేకాలకు ప్రత్యేకం..

తొలి ఏకాదశికి దేవాలయాల్లో ఎక్కాహం, అభిషేకాలు చేపడుతారు. ఎక్కాహం అంటే 24 గంటల పాటు ఆలయంలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం ఎప్పుడైతే ప్రారంభిస్తారో మరునాడు అదే సమయం వరకు నిరంతరం భక్తి భజనలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తొలి ఏకాదశి పూజలకు పట్టణంలోని పలు ఆలయాలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సింహగిరిలోని లక్ష్మీ నరసింహ్మస్వామి ఆలయం, రేణుకా ఎల్లమ్మ గుడి, పాత శివాలయం, బండ్లగేరి ప్రాంతంలోని శ్రీరుక్మిణీ పాండురంగ స్వామి ఆలయం, టీచర్స్ కాలనీ రామాలయం, పిల్లలమర్రి సమీపంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు పలు దేవాలయాల్లో నేడు తొలి ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎంతో విశిష్టత..



తొలి ఏకాదశికి ఎంతో విశిష్టత ఉంటుంది. ఏకాదశి రోజు విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత పారాయణం అత్యంత పుణ్యప్రదమైనది. ఈ ఆషాఢ మాసంలో విశేషంగా అనేక పండుగలు ఉంటాయి. ఈ చాతుర్మసం దేవతా పూజలకు నిలయమైనది. వచ్చే పండుగలకు ప్రారంభసూచిక తొలి ఏకాదశి.

– తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, కార్యనిర్వహణాధికారి, కంచికామకోటి పీఠం పాలమూరు శాఖ

నల్లమలలో పెరిగిన పెద్దపులుల సంఖ్య


అక్కమ్మబిలం వద్ద రోడ్డు దాటుతున్న పెద్ద పులి

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో పెద్ద పులుల సంఖ్య పెరగడంతో సంచారం అధికమైంది. నల్లమల ప్రాంతం గత 30ఏళ్ల పరిస్థితులను తలపించే విధంగా రోజూ ఎక్కడో ఒక ప్రాంతంలో పెద్దపులి సంచారం కనిపిస్తుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. సోమవారం రాత్రి శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి అక్కమ్మ బిలం వద్ద శ్రీశైలం వైపు జీపులో ప్రయాణిస్తున్న వారికి పెద్దపులి రోడ్డు దాటుతుండగా కనిపించిందని తెలిపారు. గంభీరమైన రూపంలో భారీ ఖాయంతో అతి సమీపంలోనే పెద్ద పులి కనిపించడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురైనట్లు తెలిపారు. జీపు లైట్ల వెలుతురుకు త్వరగా రోడ్డు దాటి అభయారణ్యంలోకి వెళ్లడంతో ఊపిరి పీల్చుకున్నామని అన్నారు. ఇదిలా ఉండగా వటువర్లపల్లి గ్రామ వ్యవసాయ పొలాలు, సమీప అటవీ ప్రాంతంలోనే రెండు మూడు పెద్దపులులు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు, ప్రయాణికులు తెలిపారు. అటవీ సరిహద్దు పరిసర ప్రాంతంలో వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబైలు గ్రామాలు, వ్యవసాయ పొలాలు ఉండటంతో ప్రజలు, కాడెద్దులపై దాడి చేసే ప్రమాదం ఉన్నందున సంబంధిత అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని పెద్దపులులను లోతట్టు అభయారణ్యంలోకి తరలించే ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

ఆరు టిప్పర్లకు రూ.1.50లక్షల జరిమానా

దేవరకద్ర: నారాయణపేట జిల్లా పరిధిలో తరలించాల్సిన ఇసుకను అక్రమంగా మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి తరలిస్తుండగా మంగళవారం సాయంత్రం పట్టుబడిప ఆరు ఇసుక టిప్పర్లకు ఒక్కోదానికి రూ.25 వేల చొప్పున రూ.1.50 లక్షల జరిమానాను విధించారు. మాగనూర్ రిచ్ పాయింట్ నుంచి నారాయణపేటకు అనుమతి పత్రాలతో తరలించాల్సిన ఇసుకను అక్రమంగా మహబూబ్ నగర్‌కి తరలిస్తుండగా తహసీల్దార్ జ్యోతి వాటిని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. బుధవారం టిప్పర్ యజమానులు తెచ్చిన అనుమతిపత్రాలు నారాయణపేట జిల్లా పరిధిలోవి కావడంతో అక్కడి అనుమతులతో అక్రమంగా తరలిస్తున్నట్లు తేలడంతో ఆరు టిప్పర్లకు జరిమానా విధించారు.

- నారాయణపేట జిల్లాలో ప్రభుత్వ భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకుని ప్రతి రోజు టిప్పర్ల ద్వారా ఇసుకను రోజంతా నారాయణపేటకు తరలిస్తారు. చివరగా సాయంత్రం ట్రిప్పు ఇసుకను మహబూబ్‌నగర్‌కు తరలించి అక్రమంగా అమ్ముకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రతి రోజూ ఇలాగే జరుగుతుందనే సమాచారం.

చెంచుల జీవనంపై అధ్యయనం


చెంచులతో చర్చిస్తున్న శిక్షకుల బృందం

- వివరాలు సేకరించిన ఎన్‌ఐఆర్‌డీ శిక్షకులు
- అమలవుతున్న పథకాల తీరుపై చర్చ


చెంచు కుటుంబం వద్ద వివరాలు ఆరా తీస్తున్న ఎన్‌ఐఆర్‌డీ శిక్షకులు

బల్మూర్: ఒకప్పుడు అడవిలోనే గుడిసెలు ఏర్పాటు చేసుకుని సమాజానికి దూరంగా జీవించే చెంచులు, నేడు గ్రామాల్లో అందరితో పాటు నివసిస్తున్నారు. వారి జీవన విధానంపై అధ్యయనం చేయడానికి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఐఆర్‌డి) శిక్షకుల బృందం బుధవారం కొండనాగుల పంచాయతీలోని గుడిబండ చెంచు కాలనీని సందర్శించింది. కోఆర్డినేటర్ డాక్టర్ సత్య రంజన్ మహాకుల్ ఆధ్వర్యంలో అధికారులు చెంచు కుటుంబాలు, తొమ్మిది రాష్ట్రాల నుంచి వచ్చిన 55 మంది ఎన్‌ఐఆర్‌డి శిక్షకులతో సమావేశం నిర్వహించారు. చెంచు కుటుంబాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా లబ్ధి, మహిళా సంఘాల ఏర్పాటు వారికి అమలవుతున్న ప్రత్యేక పథకాలపై చెంచులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా పని కల్పిస్తూ, అడ్వాన్స్‌గానే డబ్బులు చెల్లింస్తుండటంతో వలసలు మానేశారని డీఆర్‌డీఓ నర్సింగరావు తెలిపారు. ఐదు బృందాలుగా ఏర్పడిన సభ్యులు చెంచుల ఇళ్ల వద్దకు వెళ్లి జీవన స్థితిగతుల గురించి తెలుసున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌ఐఆర్‌డీ శిక్షకుల బృందం కోఆర్డినేటర్ డాక్టర్ సత్యరంజన్ మహాకుల్, డీఆర్‌డీఓ నర్సింగరావు, అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి, డీఎల్‌పీఓ వెంకటయ్య, ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీఓ దేవన్న, ఎంపీఓ చంద్రశేఖర్, సర్పంచ్ రేవతి, చెంచుమహిళా సంఘం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మయ్య, టెక్నికల్ అసిస్టెంట్ మల్లేష్, ఏపీఎం చిట్టెమ్మ, ఏపీఓ సువర్ణ, ఐకేపి సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా కేసులో 6నెలల జైలు

వనపర్తి: ఇసుక అక్రమ రవాణా కేసులో నిందితులకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ.. బుధవారం జూనియర్ సివిల్ జడ్జి, సెకండ్ అడిషనల్ జేఎఫ్‌సీఎం జానకి తీర్పు వెలువరించినట్లు ఎస్పీ రక్షితా కె. మూర్తి ఒక ప్రకటనలో తెలియజేశారు. 2016 జనవరి 29న రాత్రి వనపర్తి రూరల్ స్టేషన్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తుండగా.. కొత్తకోట రోడ్డులో మండలంలోని నాగమ్మ తండా ప్రాంతం నుంచి వచ్చిన లారీని తనిఖీ చేశారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించి లారీ డ్రైవర్ ఇంద్రయ్య, లారీ యజమాని కురుమూర్తిపై అప్పటి ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి కేసు నమోదు చేశారు. పలు దఫాలుగా వాదోపవాదనలు విన్న తర్వాత తీర్పు వెలువడింది. నిందితులకు శిక్ష పడేందుకు కృషిచేసిన వనపర్తి సెకండ్ అడిషనల్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీతా దేవి, సీఐ మహేశ్వర్ రావు, ఎస్‌ఐ నాగన్న, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ రాజేందర్‌లను ఎస్పీ అభినందించారు.

నెలక్రితం పెళ్లి.. అంతలోనే మృతి

- మృతుడు ఫార్మా పరిశ్రమలో సూపర్ వైజర్
- అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

జడ్చర్ల: నెల కిందటనే ఆ యువకునికి పెళ్లి అయ్యింది. అంతలోనే ఆకస్మికంగా చావు వార్త వినాల్సి వచ్చిందని కుటుంబసభ్యులు లబోదిబోమంటున్నారు. మండల పరిధిలోని పోలేపల్లి సెజ్‌లో విధులు నిర్వర్తిస్తున్న వినేష్(28) ఆకస్మికంగా అనుమానాస్పదస్థితిలో మరణించాడు. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు... మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం తుల్జారాంపేటకు చెందిన వినేష్ గత ఏడాది కాలంగా పోలేపల్లి సెజ్‌లోని ఎవర్టోజన్ ఫార్మా పరిశ్రమలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. గతనెల 11న వినేష్‌కు వివాహమైంది. పెళ్లి తర్వాత జడ్చర్లలోనే ఉంటూ విధులకు వెళ్తున్నాడు. ఈక్రమంలో సొంత ఊరు వెళ్లి, మంగళవారం జడ్చర్లకు వచ్చాడు. విధులకు హాజరయ్యారు. పనిలో ఉండగానే నోటిలో నురగలు కక్కుతూ మృతి చెందాడు. పరిశ్రమ నిర్వాహకులు గమనించే టప్పటికే మరణించినట్లు గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే వినేష్ మరణంపై పరిశ్రమ నిర్వాహకులకు సంబంధం ఉందని ఆరోపిస్తూ కొందరు పరిశ్రమ దగ్గర ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్‌ఐ ఖాదర్ సంఘటన స్థలానికి చేరుకుని విచారించి, పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని బాదేపల్లి ఆస్పత్రికి తరలించారు. వినేష్ మరణంపై తమకు అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని మృతుడి చిన్నాన్న లావుడ్య బాబ్యానాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

జోగుళాంబకు బంగారు పతకం


ఆలయ చైర్మన్, పాలక మండలికి అందజేస్తున్న బంగారు పతకం

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ అమ్మవారికి బుధవారం ఓ భక్తుడు రూ.7.60లక్షల విలువ చేసే బంగారు పతకాన్ని అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని కడప జిల్లాకు చెందిన దేవగిరి చంద్రమౌళీశ్వర రెడ్డి, ప్రభావతి దంపతులు 111 గ్రాముల బరువు ఉన్న బంగారు మహాకాళీ పతకాన్ని తయారు చేయించారు. వీటిని అమ్మవారి వద్ద ఉంచి పూజ చేయించి అనంతరం ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, పాలక మండలి ధర్మకర్తలు వెంకటనారాయణ రెడ్డి, ఆనంద్ శర్మలకు అందజేసినట్లు ఆలయ సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్ తెలిపారు. గతంలో కూడా ఈ దంపతులు అమ్మవారికి మరో బంగారు పతకాన్ని సమర్పించారు. విశేష సందర్భాల్లో వీటిని అలంకరించాలా లేక నిత్యం అమ్మవారికి అలంకరించాలా అనే అంశంలో ఆలయ అర్చకులతో మాట్లాడి పాలకమండలి తగు నిర్ణయం తీసుకుంటుందని తెలియజేశారు. దాతలను ఆలయ చైర్మన్, పాలక మండలి అభినందిస్తూ.. వారికి ప్రసాదాలు అందజేశారు.

బక్రీద్‌కు పొట్టేళ్లు సిద్ధం

- ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజుకు ఏర్పాట్లు


పాలమూరులోని రహెమానియా ఈద్గా


మహబూబ్‌నగర్‌లో న్యూటౌన్ వద్ద పొట్టేళ్ల విక్రయాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లింలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం చివరి మాసమైన జిల్‌హిజ్జా 10తేదీన జరుపుకునే ఈ పండుగను ‘ఈదుల్ జుహా’ వ్యవహరిస్తారు. సామూహికంగా ముస్లింలు ఈద్గాకు వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజు చేయడం రివాజు. జిల్లావ్యాప్తంగా సర్వమానవ కల్యాణం కోసం నమాజు చేసి ప్రార్థనలు చేస్తారు. కాగా.. పండుగ సందర్భంగా గొర్రె పొట్టేళ్ల విక్రయాలు ఊపందుకున్నాయి. మహబూబ్‌నగర్‌లోని జామియ మసీదు నుంచి ఉదయం 8.00 గంటలకు ముస్లింలు సామూహికంగా గడియారం చౌరస్తా మీదుగా స్థానిక రహెమానియ ఈద్గా వద్దకు చేరుకొని 9 గంటలకు ప్రత్యేక ఈద్ నమాజ్ చేస్తారు. జామియా మసీదు ప్రధాన ఇమామ్ హాఫిజ్ ఇస్మాయిల్ ప్రత్యేక నమాజు ప్రార్థనలు చేయిస్తారు.

మజీదుల్లో ప్రత్యేక ఈద్ నమాజ్‌లు..

మహబూబ్‌నగర్‌లోని మజీదుల్లో ఈద్ నమాజ్‌కు ఏర్పాట్లు చేశారు. మక్కా మజీద్, మదీనా మజీద్, రైల్వేస్టేషన్ మజీదే ఓమర్, సిరాజుల్ ఉలుమ్ మజీద్, మజీదే షర్ఫి చమన్, షాసాబ్‌గుట్ట మజీద్, సూఫియ మజీద్, మునీర్ మజీద్, షంసు, అల్‌కౌసర్, అన్వారే మదీనా మజీద్‌లతో తోపాటు ఇతర మజీద్‌లలో బక్రీద్ ఈద్ నమాజ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఊపందుకున్న పొట్టేళ్ల విక్రయాలు

బక్రీద్‌లో ఖుర్బానీకి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. మూడు రోజుల పాటు పొట్టేళ్ల మాంసాన్ని పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంతో పాటు ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాల్లో నాలుగు రోజుల నుంచే విక్రయ కేంద్రాలు వెలిశాయి. ఈ ఏడాది పొట్టేళ్ల విక్రయాలు ఊపందుకున్నాయి. మరో రెండు రోజుల పాటు పొట్టేళ్ల విక్రయాలు జరగనున్నాయి. మహబూబ్‌నగర్‌లోని న్యూటౌన్, వన్‌టౌన్, క్లాక్‌టవర్, మార్కెట్, మదీనా మసీద్, షాసాబ్‌గుట్ట, రాయచూర్ రోడ్ తదితర ప్రాంతాల్లో పొట్టేళ్ల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఖుర్బాని మూడు రోజులు ఉండడంతో పొటెళ్లను విక్రయానికి ఉంచారు. ఉమ్మడి జిల్లాలో ఈ మూడు రోజుల్లో 2 లక్షలకు పైగా పొట్టేళ్లకు విక్రయాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అదే విధంగా పండుగకు సంబంధించి దుకాణాల్లో పండుగ ప్రత్యేక వంటకం షీర్ కుర్మ తయారీ కోసం ఉపయోగించే సేమియాలు, డ్రైఫ్రూట్స్‌లతో పాటు మిస్వాక్, ఇత్తర్ (సుగంధ ద్రవ్యాలు), సుర్మాలను కొనుగోలు చేశారు.



